
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024



మసాజ్ సెంటర్‌లో పట్టుబడిన ఎస్ఐ

- నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు మసాజ్‌సెంటర్లపై కేసు నమోదు
- ఏడుగురు విటులు అరెస్టు
- 17 మంది యువతులు స్వధార్‌హోమ్‌కి అప్పగింత

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్‌లో యువతులతో అభ్యంతరకరమైన స్థితిలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు పోలీసుల ఆకస్మిక దాడుల్లో పట్టుబడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్పాల ముసుగులో చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి ఆకస్మిక సోదాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో నగరంలోని 64 స్పా/మసాజ్ సెంటర్లలో 200 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మసాజ్ సెంటర్లలో యువతులతో మగవారికి మసాజ్ చేయిస్తుండడం, అభ్యంతరకరమైన రీతిలో మరికొందరు కనిపించడంతో పోలీసులు ఆయా సెంటర్లపై కేసులు నమోదుచేశారు. ఏడుగురు పురుషులను అరెస్టు చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 17 మంది యువతులను స్వధార్‌హోమ్‌కు అప్పగించారు. పోలీసులు కేసు నమోదుచేసిన నాలుగు మసాజ్ సెంటర్లు కూడా జోన్-2 పరిధిలో ఉండడం విశేషం. అయితే జోన్-1 పరిధిలో దాదాపు 60 వరకూ మసాజ్ సెంటర్లు ఉన్నప్పటికీ ఒక్క కేసు కూడా నమోదుచేయకపోవడంపై పోలీస్ వర్గాల్లో సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచరపాలెం స్టేషన్ పరిధిలోని ఒక మసాజ్ సెంటర్‌లో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన పోలీసులకు అభ్యంతరకరమైన రీతిలో ఒకరు పట్టుబడ్డారు. అతడిని విచారించగా తాను నగర పోలీస్ కమిషనరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నట్టు వెల్లడించాడు. పోలీసులు ఆ సమాచారం ఆధారంగా పోలీసులు ఆరా తీయగా 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐగా తేలడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు అతనిపై కూడా విటుడిగా కేసు నమోదుచేశారు. పోలీసులే మసాజ్ సెంటర్లకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

- 18 నుంచి నెలాఖరు వరకూ...
- 31,379 మంది విద్యార్థులు... 138 కేంద్రాలు
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించం
- ఈ నిబంధన సిబ్బంది, అధికారులకు కూడా వర్తిస్తుంది
- జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ

విశాఖపట్నం/ఆరిలోవ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):



డీఈవో చంద్రకళ

ఈనెల 18వ తేదీ నుంచి నెలాఖరు వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 31,379 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,367, ప్రైవేటు విద్యార్థులు 3,012 మంది ఉన్నారన్నారు. రెగ్యులర్ విద్యార్థులలో 14,972 మంది బాలురు, 13,395 బాలికలు ఉన్నారన్నారు. 24,644 మంది ఆంగ్ల మాధ్యమంలో, 3,704 మంది తెలుగు మాధ్యమంలో, 10 మంది ఉర్దూ, తొమ్మిది మంది ఒరియా మాధ్యమంలో పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షల నిమిత్తం మొత్తం 138 కేంద్రాలు (నగరంలో 107, గ్రామీణ ప్రాంతంలో 31) కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,400 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించామన్నారు. 300 మందితో సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటుచేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కాగా ఒకేషనల్‌కోర్సులకు సంబంధించి 1,256 మంది పరీక్షలు రాస్తారన్నారు.

ఓపెన్ స్కూళ్ల ద్వారా 2,201 మంది

ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ స్కూళ్ల ద్వారా పది, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఐదు కేంద్రాల్లో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 986 మంది, ఆరు కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 1,215 మంది హాజరవుతారన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని ఆమె ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్ర) 6.10
సహరి (శని) 4.49

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు.
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

గాజువాకపై

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు ఖరారు
- మరోమారు పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తారని కొద్దికాలంగా ప్రచారం
- ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి బరిలోకి దిగుతుండడంతో ఇక్కడ పల్లాకు లైన్‌క్లియర్

వీడిన ఉత్కంఠ

విశాఖపట్నం/గాజువాక, మార్చి 14: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థిగా గురువారం పల్లా శ్రీనివాసరావును ప్రకటించింది. దీంతో గత కొద్దిరోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. పొత్తులో భాగంగా గాజువాక సీటును జనసేన పార్టీకి కేటాయిస్తారని, పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇరు పార్టీల నేతల్లోను ఉత్కంఠ నెలకొంది. అయితే జనసేన అధినేత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో గాజువాకలో పల్లా శ్రీనివాసరావుకు లైన్‌క్లియర్ అయ్యింది. ఈ మేరకు అధిష్ఠానం పల్లా శ్రీనివాసరావు పేరును అధికారికంగా ప్రకటించింది.

పల్లా రాజకీయ నేపథ్యం

పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం కార్మిక నాయకులు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు విశాఖ-2 సెగ్మెంట్ నుంచి తెలుగుదేశం తరపున పోటీ ... మిగతా 6వ పేజీలో



పల్లాకు అభినందన

గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతున్న సమయంలో అధిష్ఠానం అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. గాజువాక నుంచి పల్లా పేరును ఖరారు చేయడంతో కార్యాలయంలో ఆయన్ను పార్లమెంటు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్, తదితరులు అభినందిస్తూ మిఠాయిలు తినిపించారు.

కూటమి దూకుడు

అభ్యర్థుల ప్రకటనలో ముందున్న టీడీపీ, జనసేన


- అనకాపల్లి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకూ ఖరారు
- నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లికి గతంలోనే ఖరారు
- తాజాగా మిగిలిన నాలుగింటికి అభ్యర్థులు ప్రకటన
- చోడవరం నుంచి కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు
- పంచకర్లకు పెందుర్తి, విజయకుమార్‌కు ఎలమంచిలి..



కేఎస్ఎన్ఎస్ రాజు



పైలా ప్రసాదరావు



సుందరపు విజయకుమార్

అనకాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలకు ఒకటి, రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు వుండడంతో అభ్యర్థుల ఎంపికను ప్రధాన రాజకీయ పార్టీలు వేగవంతం చేశాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒకింత ముందున్నాయి. ఈ రెండు పార్టీలతో పాటు బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించనున్నట్టు చెబుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో టీడీపీకి కేటాయించిన నర్సీపట్నం నుంచి మాజీ మంత్రి ... మిగతా 6వ పేజీలో

జనసేన అభ్యర్థులు ఖరారు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జనసేన పార్టీకి నాలుగు స్థానాలు లభించాయి. వాటికి అభ్యర్థులను పార్టీ ఖరారు చేసింది. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఎలమంచిలి నియోజకవర్గం నుంచి సుందరపు విజయకుమార్, పెందుర్తి నియోజకవర్గం నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేర్లు పవన్‌కల్యాణ్ ఖరారు చేశారు.

నాలుగోసారి బరిలోకి పంచకర్ల రమేశ్



పంచకర్ల రమేశ్‌బాబు నాలుగో సారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈసారి జనసేన పార్టీ తరపున పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు ఆయన అందులోచేరి 2009లో పెందుర్తి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత ప్రజా రాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో పంచకర్ల టీడీపీలో చేరారు. 2014లో టీడీపీ తరపున ఎలమంచిలి నుంచి పోటీ చేసి గెలిచారు. 2019లో కూడా మరోమారు ఎలమంచిలి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. నాలుగేళ్ల క్రితం టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ సరైన గౌరవం ఇవ్వడం లేదని జనసేనలోకి వచ్చారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. సీనియర్ కావడంతో ఆయన కోరుకున్న పెందుర్తి స్థానం ఇచ్చారు.

సౌత్ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్



చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ ప్రజారాజ్యం పార్టీతో రాజకీయ జీవితం ప్రారంభించారు. 2009లో విశాఖ తూర్పు నుంచి పోటీ చేసి..వెలగపూడి రామకృష్ణబాబు చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత ఆయన వైసీపీలో చేరారు. విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. 2014లో మళ్లీ తూర్పు నుంచే వెలగపూడిపై పోటీ చేసి రెండో సారి ఓటమి చవిచూశారు. 2019 ఎన్నికల్లో తూర్పు టికెట్ ఆశించినా దక్కలేదు. ఆ తరువాత మేయర్ పదవి ఇస్తామని వైసీపీ పెద్దలు చెప్పడంతో జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచారు. అనూహ్యంగా ఆ అవకాశం హరికుమారికి ఇవ్వడంతో వంశీకృష్ణ ఆవేదన చెందారు. ఆ తరువాత ఆయనకు పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. అయితే ప్రజల ఓట్లతో నేరుగా గెలవాలనే ఆకాంక్షతో జనసేనలో చేరారు. విశాఖ దక్షిణం నుంచి పోటీ చేసే అవకాశం దక్కించుకున్నారు. దీంతో మూడోసారి ఆయన అసెంబ్లీకి పోటీ చేసినట్టవుతోంది.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

స్టేషన్‌లో సెటిల్‌మెంట్

- అందులో ఒకరి నుంచి రూ.30 వేలు డిమాండ్
- రూ.పది వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం
- లంచం ఇవ్వనంటే బాధితుడి స్నేహితుడి వద్ద ఫోన్ లాక్కుని... డబ్బులు ఇచ్చి తీసుకువెళ్లమన్న అధికారి

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరిలోవ ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ

విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన ఒకరు విశాఖ నగరంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద కారు కొనుగోలు చేశారు. కారుపై ఉన్న ఫైనాన్స్‌ను ప్రతి నెలా కొనుగోలుదారే చెల్లించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కారు కొనుగోలు చేసిన వ్యక్తి కొన్ని నెలలుగా ఫైనాన్స్ వాయిదాలను చెల్లించలేకపోయారు. కారును విక్రయించిన వ్యక్తికి బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వారం కిందట ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేయకుండా ఇరువర్గాలను కూర్చోబెట్టి సెటిల్‌మెంట్ చేశారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న వాయిదాలకు సంబంధించిన మొత్తంతో పాటు కారును కూడా వెనక్కి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. కేసు సెటిల్ చేసినందుకు తనకు రూ.30 వేలు ఇవ్వాలని కారును కొనుగోలు చేసిన విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన వ్యక్తిని ఎస్ఐ హరికృష్ణ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బుల్లేవని, ఇప్పటికే అప్పుల పాలైపోయానని బాధితుడు చెప్పారు. దీంతో కేసు కట్టకుండానే వివాదాన్ని సెటిల్ చేశానని, కనీసం రూ.పది వేలు అయినా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ హరికృష్ణ స్పష్టంచేశారు. ఆ మొత్తం కూడా లేదని బాధితుడు చెప్పడంతో అతడితోపాటు స్టేషన్‌కు వెళ్లిన అతని స్నేహితుడు శ్రీకాంత్ వద్ద సెల్‌ఫోన్ లాక్కుని, రూ.30 వేలు ఇచ్చిన తర్వాత సెల్‌ఫోన్ పట్టుకువెళ్లాలని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు 1440 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం గురువారం బాధితుడికి రూ.పది వేలు ఇచ్చి స్టేషన్‌కు పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్ఐ హరికృష్ణ స్వయంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇదిలావుండగా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ హరికృష్ణ మొదటి నుంచి వివాదాస్పదుడేనని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2012 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణ నగరంలో స్పెషల్ బ్రాంచిలో కొన్నాళ్లు పనిచేసి, రాజకీయంగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి సొంత జిల్లా అయిన ... మిగతా 6వ పేజీలో

బయోమెట్రిక్ తప్పనిసరి

స్టీల్ ప్లాంటు యాజమాన్యం కీలక నిర్ణయం

నేటి నుంచి బయోమెట్రిక్ వేస్తేనే హాజరు

- వ్యతిరేకిస్తున్న కార్మికులు
- ముందు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ఆందోళనకు సన్నద్ధం

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుపై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇక్కడి కార్మికులు సహకరించడం లేదని, వారి వల్లే నష్టాలు వస్తున్నాయని చెప్పే ప్రయత్నం చేస్తోంది. వాస్తవానికి స్టీల్‌ప్లాంటు ముడి పదార్థాలు సకాలంలో అందక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. ఐరన్‌ఓర్ సరఫరా చేసే ఎన్ఎండీసీ కూడా ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంది. అవసరమైనంత ఓర్ సకాలంలో అందేలా చూడాల్సిన మంత్రి దానిని సమీక్షించకుండా విశాఖ ప్లాంటులో కార్మికుల బయోమెట్రిక్ గురించే గత రెండు నెలలుగా ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం కార్మికులంతా సంతకాలు చేసే ప్లాంటులోకి వెళుతున్నారు. ఏదైనా ఒకటే హాజరు. వేలాది మందిలో ఓ పది మంది అత్యవసర పనులపై బయటకు వెళితే..దానిని సాకుగా చూపించి, అంతా అలాగే వెళ్లిపోతున్నారని, అందుకే బయోమెట్రిక్ వేయాలనే నిబంధన పెట్టారు. అందుకోసం 600 బయోమెట్రిక్ (బార్స్) యంత్రాలు తీసుకువచ్చారు. ఎగ్జిక్యూటివ్‌లు (అధికారులు) అంతా దీనికి అంగీకరించారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌లు (కార్మికులు) మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారు. తమకు చాలాకాలంగా వేతన సవరణ చేయాల్సి ఉందని, ముందు దాని సంగతి చూడాలని, అలాగే ప్లాంటులో కొన్ని మౌలిక వసతులు లేవని, వాటిని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చిన తరువాత బయోమెట్రిక్‌కు అనుమతిస్తామని చాలా స్పష్టంగా చెప్పారు. ప్లాంటు ఏర్పాటుచేసి మూడున్నర దశాబ్దాలు గడుస్తున్నా నైట్ షిఫ్టులో కార్మికులకు ఆకలేస్తే తినడానికి ఏమీ దొరకదని, క్యాంటీన్లలో ఏమీ ఉండవని వారు ఆరోపిస్తున్నారు. తాము అవసరమైనవే అడుగుతున్నామని, గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని కార్మిక సంఘ నాయకులు అంటున్నారు. ఇదే విషయమై వారు ఇటీవల పరిపాలనా భవనంలోని పర్సనల్ డైరెక్టర్ కార్యాలయంలో 36 గంటలసేపు ఆందోళన చేపట్టారు. సీఎండీని కూడా ఘెరావ్ చేశారు. దీనిని ఉక్కు మంత్రిత్వ శాఖ సీరియస్‌గా ... మిగతా 6వ పేజీలో



ఉక్కులో బయోమెట్రిక్

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా జీతాలు బంద్

- జనరల్ ఆస్పత్రి సిబ్బందికీ నిల్ -6వ పేజీలో

దొడ్డిదారిన టీచర్ల బదిలీ

- జిల్లాకు చేరిన ఉత్తర్వులు
- మొత్తం 90 మందికి విశాఖ నగరం, చుట్టుపక్కల పోస్టింగ్
- ఏజెన్సీ నుంచి 70 మంది ఎస్జీటీలు...
- ఈ ఏడాది జూన్‌లో ఖాళీ కానున్న పోస్టుల్లోనూ నియామకం
- బదిలీల్లో రూ. 3.5 కోట్లు సొమ్ములు వసూళ్లు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ వింత పోకడలు పోతోంది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు ఖాళీ కానున్న పోస్టుల్లో ఇప్పుడే పలువురిని నియమిస్తూ ఆదేశాలు ఇస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా అంటే దొడ్డిదారిన ఉమ్మడి జిల్లాలో సుమారు 90 టీచర్లను తాము పనిచేసే పాఠశాలల నుంచి కోరుకున్న చోటకు బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.3.5 కోట్లు వరకూ చేతులు మారాయని, అధికార పార్టీ కీలక నేత పీఏ సూత్రధారిగా వ్యవహరించారని సమాచారం. ఏజెన్సీలో పనిచేస్తున్న సుమారు 70 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు విశాఖ నగరం, పరిసరాలు, మైదాన ప్రాంతంలో స్కూళ్లలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఖాళీలు లేవు. రానున్న రెండు, మూడు నెలల్లో పలువురు టీచర్లు పదవీ విరమణ చేయనున్నారు. అప్పటివరకూ ఆయా ఉపాధ్యాయులు (ప్రస్తుతం బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నవారు) ప్రస్తుతం పనిచేసే పాఠశాలల్లోనే పనిచేస్తారు. ఈ మేరకు విశాఖ జిల్లా శాఖాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చినా గోప్యంగా ఉంచుతోంది.

నగరానికి రామ్‌చరణ్

గోపాలపట్నం, మార్చి 14: ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన సినీ హీరో రామ్ చరణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు పెద్దసంఖ్యలో అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం రామ్‌చరణ్ రోడ్డు మార్గంలో హోటల్ నోవాటెల్‌కు వెళ్లారు.



ఎయిర్‌పోర్టులో రామ్‌చరణ్

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

అక్కయ్యపాలెం: గ్రేటర్ 44వ వార్డు లబ్ధిదారులకు గురువారం కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను కేకే రాజు పంపిణీ చేశారు. శ్రీనివాసనగర్ సచివాలయంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు.











రహదారులపైనే వాహనాల పార్కింగ్

- రాకపోకలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

మురళీనగర్, మార్చి 14: భారీ వాహనాలపై రహదారులపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే నగరంలో ఎటు చూసినా వాహనాలు భారీగా పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాలపై రోడ్లపైనే నిలిపి వేస్తుండడంతో మరిన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, స్కూల్స్, భారీ షాపింగ్ మాల్స్, మార్కెట్ ప్రాంతాలతో రద్దీగా ఉండే ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. మెయిన్ రోడ్ల నుంచి వీధి రోడ్ల వరకు మాధవధార, ఎన్‌జీజీవోఎస్ కాలనీ, మురళీనగర్ ప్రాంతాల్లో వ్యాపారుల గోదాములు ఉన్నాయి. వాటికి సరకులు చేరవేసేందుకు వచ్చే భారీ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తుండడంతో ప్రయాణ మార్గాలు కుచించుకుపోతున్నాయి. ఆయా వాహనాలను రోజంతా నిలిపి ఉంచుతుండడంతో ఉదయం సాయంత్రం వేళ్లలో ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ ఈ సమస్య జటిలమవుతోంది. వాహనాలు సమీపించేవరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటీఎం నగదు రవాణా సాగించే వాహనాలతో మాధవధార ఉడాకాలనీ చివరి బస్టాపు నుంచి ఎగువ కొండ దగ్గరి నివాసిత ప్రాంతాల వరకు చిక్కులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ జంక్షన్, ఆర్టీఏ కార్యాలయం వద్ద హైవే సర్వీసు రోడ్లలో భారీ వాహనాల నిలిపివేతతో ఉదయం స్కూలు బస్సుల నుంచి, రోజంతా ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలకు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై మాధవధారలోనే ఉన్న కంచరపాలెం ట్రాఫిక్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఉడా కాలనీలో రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు


ఆర్‌అండ్‌బీ కూడలిలో భారీ వాహనాలు ఇలా...

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 14: రానున్న ఎన్నికల్లో వైసీపీ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసే బాధ్యత టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులపై ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు పిలుపు నిచ్చారు. నక్కవానిపాలెం అరవై అడుగుల రోడ్డులో బీజేపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత విష్ణుకుమార్‌రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలో వచ్చిన జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అరాచకాలు సృష్టించే వ్యక్తిని ఓడించి ప్రజలు ఉత్తమ తీర్పు ఇవ్వాలని కోరారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు మంచి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ నాయకుడు బర్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నక్కవానిపాలెంలో శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

44వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం

అక్కయ్యపాలెం: గ్రేటర్ 44వ వార్డు రామచంద్రానగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ నేతలు మళ్ళ లక్ష్మి, రఘునాద్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంత పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవి తొలగాలంటే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్, నాగడమూడి నానాజీ, కేవీ కుమార్, గురుగోవిందసింగ్, శ్యామల దీపిక, సురేష్, చిన్నలక్ష్మి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గురువారం మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ప్రచారం చేశారు. 49వవార్డు చాకలిగెడ్డ, 50వవార్డు సత్యసాయినగర్ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యకర్తలు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

కిడ్నీల సంరక్షణపై బీచ్ రోడ్డులో వాక్ థాన్

సీతంపేట, మార్చి 14: కిడ్నీ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లతో జీవన విధానాన్ని కొనసాగించాలని అప్పుడే కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రవీంద్రవర్మ తెలిపారు.ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించామన్నారు. ఏఐఎన్‌ఏయూ ఈడీ డాక్టర్ అమిత్ సాప్లే, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ ఉదయ్ గజారే, డాక్టర్ శ్యాం పేరి పాల్గొన్నారు.


వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పరీక్షల్లో 'పది' విద్యార్థులు ప్రతిభ చూపాలి

సీతమ్మధార, మార్చి 14: పదో తరగతి విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సూచించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలలో గురువారం సమితి సభ్యులు విద్యార్థులకు పెన్నులు, ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది 9వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున అందచేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు కె.హరి, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎల్‌ఎం శర్మ, ప్రశాంతి, రాంప్రసాద్, ధనలక్ష్మి, జనార్దనరావు, పార్వతి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రతినిధులు

శంకువానిపాలెంలో పార్కు ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 14: గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలో రూ.16.3 లక్షల వ్యయంతో నిర్మించిన జీవీఎంసీ పార్కును కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీలా వెంకటలక్ష్మి, ముక్కా కిశోర్ కుమార్, బొడ్డేటి కిరణ్, రేవతిరావు, రవిబాబు పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్

అక్కయ్యపాలెం, మార్చి 14: వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా అక్కయ్యపాలేనికి చెందిన ఎం.సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకం ఉంచి, పదవి అప్పగించిన నాయకులకు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 14: విద్యుత్ హెచ్చు తగ్గులు తగ్గించే నిమిత్తం నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్, స్టడీ సెంటర్, శారదస్కూల్, శివాలయం స్ట్రీట్, వివేకానంద కళ్యాణ మండపం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

హాకీ టోర్నీకి విశాఖ క్రీడాకారిణులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 14: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ టోర్నీకి విశాఖకు చెందిన దివ్య, మాధురి, కళ్యాణి ఎంపికయ్యారు. పుణేలో జరగనున్న టోర్నీలో రాష్ట్ర జట్టుకు వీరు ప్రాతినిథ్యం వహించనున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో జరిగిన టోర్నీలో దివ్య, మాధురి, కళ్యాణి ప్రతిభ చూపి జాతీయ టోర్నీకి ఎంపికయ్యారు. వీరిని జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కేఈ అప్పారావు, కేవీ ఆంజనేయరావు, కోశాధికారి సత్యామృతం (అంబు), రాంజీ కోచ్‌లు అభినందించారు.

గీతం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మార్చి 14: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో ఎనభై అడుగుల రోడ్డులోని రాయల్ అపార్ట్‌మెంట్‌లో బసవతారకం కేన్సర్ హాస్పిటల్, గీతం సహకారంతో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బీపీ, షుగర్, ఎముకలు, కంటి పరీక్షలు, గైనిక్ సమస్యల నిర్ధారణ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గీతం సంస్థల అధినేత శ్రీభరత్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు శ్యామలా దీపిక, బొడ్డేటి శ్రీదేవి, కొయిలాడ వెంకటేష్, యాగాటి ఆదిలక్ష్మి, అమ్మాజి, పొలమరశెట్టి శ్రీనివాస్, రాజగిరి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేయించుకుంటున్న విష్ణుకుమార్ రాజు, శ్రీభరత్

విద్యుత్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అక్కయ్యపాలెం, మార్చి 14: విద్యుత్ సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలంతా సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ కోరారు. గ్రేటర్ 45వ వార్డు ఏఎస్‌ఆర్‌నగర్‌లోని టిడ్కో ఇళ్లలో నివశిస్తున్న వారికి గురువారం విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల విద్యుత్‌ను సబ్సిడీ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుల జెరాక్సులను అక్కయ్యపాలెంలోని విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వీఏ విద్యాసాగర్, ఏఈ జి.హరగోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

వంశీకృష్ణకు శెట్టిబలిజ, యాత సంక్షేమ సంఘం మద్దతు

మహారాణిపేట, మార్చి 14: దక్షిణ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ విజయానికి కృషి చేస్తామని విశాఖ యాత, శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్‌యాత అన్నారు. మహారాణిపేట గ్రీన్‌పార్క్‌లోని సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి వంశీకృష్ణకు సంఘీభావం ప్రకటించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి, శెట్టిబలిజ యాత సమాజిక వర్గం ఉన్నతి వంశీకృష్ణతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్తిమద్దతు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. సుమారు 50 వేల మెజారిటీతో వంశీకృష్ణ విజయానికి కృషి చేస్తామన్నారు.


జనసేన ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులు

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

జగదాంబ కూడలి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జగదాంబ జంక్షన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆ పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్ ఎగురవేశారు. పొత్తుల్లో భాగంగా దక్షిణ నియోజకవర్గ టికెట్ జనసేనకు కేటాయించడంతో పార్టీ శ్రేణులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. పార్టీ సమన్వయకర్త ప్రసాద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా కోడిగుడ్ల ట్రేలను పంపిణీ చేశారు. పాతనగరంలోని పలు వార్డుల్లో ఉచితంగా నిత్యావసర సరకులు అందజేశారు. జగదాంబ జంక్షన్ ఏర్పాటు చేసిన శిబిరంలో పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి

మురళీనగర్: ఉత్తర నియోజకవర్గంలో జనసేన పార్టీ నిర్దిష్టమైన ఓటు బ్యాంకుతో బలంగా పనిచేస్తోందని ఆ పార్టీ నాయకులు సంకు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు జనసైనికులంతా రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి విజయానికి పనిచేస్తామన్నారు. 50వవార్డులో గురువారం నిర్వహించిన జనసేన ఆవిర్భావ వేడుకల్లో శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీ పాలనా వైఫల్యంపై విసిగెత్తి ఉన్న జనం మార్పు కోరుతున్నారన్నారు. పార్టీ 50 వార్డు అధ్యక్షుడు మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తర ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, బి.రఘు జెండా ఎగుర వేశారు. నాయకులు, వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.


సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

గాజువాకపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తండ్రికి రాజకీయాల్లో శ్రీనివాసరావు చేదోడు వాదోడుగా ఉండేవారు. 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజారాజ్యం పార్టీలో చేరి విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మూడు లక్షలకుపైగా ఓట్లు సాధించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యింది. రాష్ట్ర విభజన అనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరి గాజువాక నుంచి పోటీ చేసి 22 వేల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

2020లో జిల్లా అధ్యక్షునిగా....

2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని పటిష్ఠ పరిచారు. 2020లో జిల్లా పార్టీ అధ్యక్షుని పగ్గాలు చేపట్టారు.

అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తా: పల్లా

అధికారం ఉన్నా లేకపోయినా పార్టీకి విధేయుడిగా, ప్రజలకు అండగా ఉన్న తనకు వరుసగా మూడోసారి గాజువాక టికెట్ కేటాయించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. టికెట్ కేటాయించినందుకు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. గాజువాకలో అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తాను.

భీమిలి పెండింగ్

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు (ఆరు పూర్తిగా, మరొకటి పాక్షికంగా) ఉండగా..తెలుగుదేశం పార్టీ నాలుగు (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక), జనసేన రెండు (విశాఖపట్నం సౌత్, పెందుర్తి), బీజేపీ ఒక (విశాఖపట్నం నార్త్) చోట పోటీ చేయనున్నాయి. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి జాబితాలో విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుల పేర్లు ప్రకటించారు. గురువారం గాజువాకకు పల్లా శ్రీనివాసరావును ఖరారు చేశారు. ఇంకా భీమిలికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. అలాగే లోక్‌సభ స్థానం నుంచి 'గీతం' విద్యా సంస్థల అధ్యక్షులు ఎం.శ్రీభరత్ పోటీ చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అధికారికంగా ప్రకటించలేదు. ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పోటీ చేసే అవకాశం ఉంది.

కూటమి దూకుడు

... 5వ పేజీ తరువాయి

చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, జనసేన పార్టీకి కేటాయించిన అనకాపల్లి సెగ్మెంట్ నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లను గత నెల 24వ తేదీన ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన విషయం తెలిసింది. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గురువారం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి కేటాయించిన చోడవరం నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు పోటీ చేస్తారని పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. ఇక జనసేన పార్టీకి కేటాయించిన పెందుర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పేర్లను అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. అయ్యన్న, అనిత, కొణతాల ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, తాజాగా టికెట్లు ఖరారైన అభ్యర్థులు మంచి ముహూర్తం చేసుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇక అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది.

టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

స్పష్టంచేశారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించామన్నారు. పరీక్షల సిబ్బందికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. చివరకు కేంద్రాలు తనిఖీ చేసే సమయంలో విద్యాశాఖ అధికారులు కూడా సెల్‌ఫోన్లు పరీక్షా కేంద్రాల బయట ఉంచాలన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. పేపరు లీక్ చేసేందుకు యత్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, పరీక్షల సహాయ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళానికి బదిలీ చేయించుకున్నారు. కొన్నాళ్ల కిందట టెక్కలిలో పనిచేస్తుండగా వైసీపీ నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా వేదికపైకి ఎక్కి మహిళలతో కలిసి డ్యాన్స్ చేసినట్టు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు వీఆర్‌కు సరండర్ చేశారు. అయితే తన రాజకీయ పలుకుబడితో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు నేపథ్యంలో కొద్దిరోజుల కిందట నగరానికి బదిలీపై వచ్చిన హరికృష్ణ లంచం కోసం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

తీసుకుంది. డిమాండ్లను ఏమీ పరిష్కరించబోమని, ముందు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టంచేసింది. కార్మికులు ప్లాంటుకు వచ్చి యథాప్రకారం డాక్ షీట్లలో (డార్స్) సంతకాలు చేస్తామంటే కుదరదని, బార్స్‌లో వేలిముద్రలు వేశాకే, డార్స్‌లో సంతకాలకు అనుమతిస్తామని సీఎండీ పేరుతో ప్లాంటు మానవ వనరుల విభాగం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇప్పటి వరకు బయోమెట్రిక్‌కు వివరాలు (డేటా) ఇవ్వని వారు ఎవరైనా ఉంటే సమీపంలో కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని, 15వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని స్పష్టంచేసింది. ఇక్కడ యాజమాన్యం మాత్రం బయోమెట్రిక్ అంతా వేస్తున్నా కార్మిక వర్గాలు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయని, విధులను తప్పించుకోవడానికి ఈ ఎత్తుగడ అన్నట్టు ప్రచారం చేస్తోంది. కానీ వారికి న్యాయంగా సమకూర్చాల్సిన మౌలిక వసతులు గురించి మాట్లాడడం లేదు. ఇదంతా ప్లాంటును ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాము బయోమెట్రిక్‌కు వ్యతిరేకం కాదని, కానీ ముందు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నాయి. కాగా బయోమెట్రిక్‌పై యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనకు కార్మికులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం ఉదయం పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తామని ప్రకటించారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా జీతాలు బంద్

- జనరల్ ఆస్పత్రి సిబ్బందికీ నిల్

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. పేరుకు వారు కాంట్రాక్టు వర్కర్లే అయినా ఆయా యాజమాన్యాలకు స్టీల్‌ప్లాంటే జీతాలు చెల్లిస్తుంది. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.15 వేలు నుంచి రూ.18 వేలు ఇస్తారు. ఇలా సుమారు 12,500 మంది పనిచేస్తున్నారు. స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఒకటో తేదీ రాగానే మొదట కార్మికులకే జీతాలు చెల్లిస్తోంది. ఆ తరువాత నిధుల సర్దుబాటును బట్టి అధికారులకు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి నెల జీతాలు 13వ తేదీన ఇచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా ఇవ్వలేదు. అలాగే స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో 86 మంది పనిచేస్తున్నారు. వారికి కూడా నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నెలవారీ జీతాలపై ఆధార పడి బతికే తమకు ఏ నెలకు ఆ నెల ఇవ్వకపోతే అప్పులు చేసుకోవాలని, ఇన్నేసి నెలలు అప్పు పుట్టడం లేదని, తక్షణమే యాజమాన్యం జీతాలు చెల్లించాలని వారంతా కోరుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పెద్దలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

'జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి'

డాబాగార్డెన్స్, మార్చి 14: జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో నివారణకు కమిటీలు వేయాలన్నారు. జర్నలిస్టులకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొవిడ్‌తో మరణించిన జర్నలిస్టులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కార్యక్రమానికి ఎల్ఎన్‌పీఏ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, జాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎన్.నాగేశ్వరరావు, ఆర్కేఎస్వీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'జనసేనతోనే రాజకీయాల్లో మార్పు'

పెందుర్తి, మార్చి 14: రాజకీయాల్లో మార్పు కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాత నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో జనసైనికులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారం కోసం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశ పడలేదని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకే రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అనంతరం సుమారు వందమంది రక్తదానం చేశారు. రక్తదాతలను పంచకర్ల అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అయితి సింహాచలం నాయుడు, పిన్నింటి పార్వతి, గొరపల్లి సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: జనసేనాని పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జనసేన పార్టీ 70వ వార్డు అధ్యక్షురాలు లంకల మురళీదేవి కోరారు. వార్డు పరిధిలోని ఎల్‌వీనగర్‌లో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీకాంత్, కేవీ సూరిబాబు, టి.చిరంజీవి, ప్రసాద్, ఈశ్వర్, సత్తిరాజు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అక్కిరెడ్డిపాలెం, మార్చి 14: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ మింది 11కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా మింది, రాజీవ్‌నగర్, రాంనగర్, గిరిప్రసాద్‌కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ఉక్కు ఉత్పత్తిని మరింత పెంచాలి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14: స్టీల్‌ప్లాంట్‌లో మరింత ఉత్పత్తి చేసి కర్మాగారం ప్రగతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉక్కు కార్మిక సంఘ నాయకుడు వై.మస్తానప్ప కోరారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో ఉత్పత్తిని పెంచేందుకు యాజమాన్యం తగిన వనరులు సమకూర్చాలన్నారు. అలాగే కర్మాగారంలో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పిట్టా రెడ్డి, శశిభూషణ్‌రావు, సంజీవ్, అప్పలరాజు, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 17, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 25, దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 130, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరు చిక్కుడు 32, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 80, కీరదోస 26, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

నేడే బ్రహ్మాండమైన విడుదల



వైజాగ్	రమాదేవి
వైజాగ్	వరుణ్ ఐనాక్స్
వైజాగ్	సిఎమ్ఆర్ ఐనాక్స్
వైజాగ్	చిత్రాలయ ఐనాక్స్
వైజాగ్	ముక్తా ఎ2 సినిమాస్
నర్సీపట్నం	పివిఆర్ ఐనాక్స్
అనకాపల్లి	షిరిడీ సాయి
మధురవాడ	శ్రీకన్య సినీపోలిస్
గాజువాక	వి. శేష్
గాజువాక	సిఎమ్ఆర్ ఐనాక్స్
విజయనగరం	ఎస్‌సిఎస్ ఐనాక్స్
శ్రీకాకుళం	కీర్తిక



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ మైదానంలో గల స్పోర్ట్స్ కాంప్లెక్స్



స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

నిరుపయోగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్

- రూ.కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం
- ఆకతాయిలకు అడ్డాగా మారిందని క్రీడాకారుల ఆవేదన
- అధికారులు స్పందించి తమకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి

గోపాలపట్నం, మార్చి 14: నగరంలోని క్రీడాకారులతో పాటు శివారు ప్రాంతాలకు చెందిన ఆటగాళ్లకు ఆసరాగా ఉంటుందని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడాకారులకు అందని దాక్షలా మారింది. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కావాల్సిన అన్ని వనరులు పుష్కలంగా ఉన్నా.. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రస్తుతం పే అండ్ ప్లే ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన అధికారుల అనాలోచిత చర్య వల్ల వారికి నిరుపయోగంగా మారింది. క్రీడాకారులలతో కళకళలాడాల్సిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణం మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఆకతాయిలకు అడ్డాగా మారిందని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్ షట్టర్ వద్ద మందుబాబులు మంట వేయడంతో ఏర్పడిన వ్యర్థాలు

నెరవేరని లక్ష్యం..

గోపాలపట్నంలో ఆరేళ్ల క్రితం నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడాకారులను తీర్చిదిద్దడానికి ఎంతో అనువైన కేంద్రంగా చెప్పవచ్చు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ సుమారు రెండు ఎకరాల సువిశాల మైదానం, మైదానంలో ఓపెన్ జిమ్, క్రీడాకారులు సేదతీరడానికి గేలరీలు.. ఇలా అన్ని విధాల ఆటగాళ్లు సాధన చేయడానికి ఎంతో అనువుగా ఉంటుంది. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వల్ల క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని భావించినా ఫలితం మాత్రం శూన్యమనే చెప్పాలి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగాక వీఎంఆర్‌డీఏ ఆధీనంలో ఉన్న దీనిని శాయ్‌కు అప్పగించారు. అయితే శాయ్ ఆధ్వర్యంలో పెద్దగా క్రీడా కార్యక్రమాలు జరగకపోవడంతో గత నాలుగేళ్ల వరకు కొందరు స్థానిక వ్యక్తులే నిర్వహణ చేపట్టారు. ఈ క్రమంలో దీనిని ప్రైవేటు వ్యక్తులకు పే అండ్ ప్లే ప్రాతిపదికన 2021లో శాయ్ అప్పగించింది. అప్పటినుంచి ప్రైవేటు వ్యక్తులే దీని నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. అయితే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కాంట్రాక్టుకు తీసుకున్న వ్యక్తులు ఆదాయం రావడం లేదనే కారణంతో కొద్ది నెలల క్రితం విడిచిపెట్టినట్టు తెలుస్తుంది. దీంతో నిర్వహణ లేక ప్రస్తుతం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి.

నిర్వహణ లేక దుర్భరంగా మారుతున్న వైనం

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సరైన నిర్వహణ లేకపోవడంతో దీని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోపలకు వెళ్లే గేట్లకు చెదలు పట్టడంతో పాటు కందిరీగల పట్టులు పట్టాయి. చీకటి పడితే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఇక్కడకు చేరుతున్నారు. ఇష్టారాజ్యంగా మద్యం, మత్తు పదార్థాలు సేవించడం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ పనులు చేపట్టకపోతే లోపలి భాగంలో ఉన్న రూ.లక్షలు విలువ చేసే వుడెన్ ఫ్లోరింగ్‌కు సైతం చెదలు పట్టే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సక్రమంగా నిర్వహించి స్థానికంగా ఉంటున్న తమకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు

59వ వార్డులో ఆనంద్‌కుమార్ ప్రచారం

మల్కాపురం, మార్చి 14: జీవీఎంసీ 59వ వార్డు పరిధి నెహ్రూ నగర్, వాయుపుత్రకాలనీలలో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. అంతేకాక సొంత నిధులతో పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నానన్నారు. వీటిని ప్రజలంతా గుర్తించి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమణికుమారి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 14: రహదారి భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగివుండడంతో పాటు వాటిని ఆచరిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రాంతీయ రవాణా శాఖాధికారి ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. సౌత్ ఏషియన్ ఎల్‌పీజీ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన రహదారి భద్రతా అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వ సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం, కంపెనీ సీఈవో సంజయ్ గుహ, జి.కుమారస్వామి, బి.రవిచంద్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ

అగనంపూడి, మార్చి 14: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్టేషనరీ కిట్లను పంపిణీ చేశారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులందరూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. హెచ్‌ఎం భీమశంకర్, ప్రతినిధులు కె.హనుమంతరావు, జి.సుశీలగజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, బి.కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్సార్ టీబీకే కాలేజీలో జాబ్ మేళా రేపు

శ్రీనగర్, మార్చి 14: ఇక్కడి టీఎస్సార్ టీబీకే కళాశాలలో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కాలేజీ చైర్మన్ తలశిల బలరామకృష్ణ తెలిపారు. ఈ మేళాలో విప్రో, అమెజాన్, యాక్సిస్ బ్యాంకు, రిలయన్స్ మ్యాక్స్‌వరుణ్ మోటార్స్, డీ-మార్టుతో పాటు మరో 17 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా మూడు కాపీలు, సర్టిఫికెట్లు, స్థానికంగా ఉంటున్నట్టు ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్‌లతో హాజరవ్వాలన్నారు.

జనసేనలో వైసీపీ యువకులు చేరిక

అగనంపూడి, మార్చి 14: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలోని వైసీపీ చెందిన పలువురు యువకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. జనసేన నాయకుడు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు ఆధ్వర్యంలో గురువారం పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆ యువకులకు జనసేన పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. పెందుర్తి నియోజవర్గ జనసేన అభ్యర్థిగా రమేశ్‌బాబుకు సీటు ఖరారు కావడంతో పలువురు నాయకులు పంచకర్లకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాయకులు ఇల్లపు వాసు, విందుల చిరరాజు, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ టికెట్‌ను కాపులకు కేటాయించాలి'

పెందుర్తి-రూరల్, మార్చి 14: పెందుర్తి నియోజకవర్గం వైసీపీ టికెట్‌ను కాపులకు కేటాయించాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహరావు పార్టీ అధిష్టానాన్ని కోరారు. చీమలాపల్లి శివాలయంలో గురువారం నిర్వహించిన వైసీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఖ్యాబలం దృష్ట్యా కాపులకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. గతంలో పెందుర్తి నుంచి పోటీ చేసిన ఈటి నాగయ్య, సాలపు చినఅప్పలనాయుడు, గుడివాడ అప్పన్న, గుడివాడ గురునాథరావు, తదితరులు కాపు నాయకులేనన్నారు. సీఎం జగన్ తనకు టికెట్ కేటాయించినా పోటీకి సిద్ధంగా ఉన్నానన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పల్లా శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ

గాజువాక, మార్చి 14: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ప్రకటించడంతో ఇక్కడి పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. 'పల్లా'కు టికెట్ కేటాయించినట్టు ప్రకటించిన వెంటనే నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. గాజువాకలోని 19 వార్డుల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్యాలయానికి విచ్చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. 'పల్లా'ను కలిసిన వారిలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, బొండా జగన్, పులి లక్ష్మీబాయి, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు, తదితరులు ఉన్నారు.

కూర్మన్నపాలెం: 'గాజువాక' టికెట్‌ను పల్లా శ్రీనివాసరావుకు ప్రకటించడంతో 70వ వార్డులో తెలుగు తమ్ముళ్లు కేక్‌లు కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గాజువాకలో వార్ వన్‌సైడేనన్నారు. నాయకులు కేవీ సూరిబాబు, టి.చిరంజీవి, బి.రమణ, షేక్ రెహ్మాన్, జ్యోతి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. చట్టివా నిపాలెంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు.

ఎంఎస్ రామయ్య షాపింగ్ మాల్ జప్తునకు యత్నం

- లోపలకు రాకుండా బ్యాంకు అధికారులు, పోలీసులను అడ్డుకున్న సిబ్బంది
- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం
- నేడు అదనపు సిబ్బందితో మళ్లీ వచ్చేందుకు వెనుదిరిగిన అధికారులు

వేపగుంట, మార్చి 14: వేపగుంట కూడలిలో ఉన్న ఎంఎస్ రామయ్య షాపింగ్ మాల్‌ను జప్తు చేసేందుకు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు అడ్వకేట్ కమిషనర్‌తో రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ షాపింగ్ మాల్‌ను సీజ్ చేసి ఆక్షన్‌లో పాడుకున్న వారికి అందజేసేందుకు బ్యాంకు అధికారులు రెండు రోజుల నుంచి యత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అడ్వకేట్ కమిషనర్ లావణ్యకుమారి పోలీసుల సహకారంతో షాపింగ్ మాల్‌ను జప్తు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది అంతా ఇలాగైతే తాము రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేస్తూ షాపింగ్ మాల్‌కు అడ్డంగా కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. అయితే మాల్‌లో పనిచేస్తున్న వారిలో మహిళలు అధిక సంఖ్యలో ఉండడం.. తక్కువ సంఖ్యలో వచ్చిన పోలీసులలో మహిళ ఒకరే ఉండడంతో మరింత మంది మహిళా పోలీసుల సహకారం కావాలంటూ ఉన్నతాధికారులకు విన్నవించారు. రాత్రి తొమ్మిది గంటల వరకు షాపింగ్ మాల్ సిబ్బంది కదలకపోవడంతో పోలీసులు, అధికారులు కూడా వేచివున్నారు. దీంతో శుక్రవారం పూర్తి స్థాయి పోలీస్ సిబ్బందితో వచ్చేందుకు బ్యాంకు అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఎంఎస్ రామయ్య షాపింగ్ మాల్ యాజమాన్యం విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకులో రూ.నాలుగు కోట్లను అప్పుగా తీసుకుంది. ఇందుకు సంబంధించి రుణాలను సక్రమంగా చెల్లించకపోవడంతో అనేక పర్యాయాలు నోటీసులు ఇచ్చినా యాజమాన్యం స్పందించలేదని గోపాలపట్నం విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ నగేశ్ తెలిపారు. దీంతో మాల్‌ను ఆక్షన్‌లో పాడుకున్న వారికి అందించేందుకు వస్తే సిబ్బంది అడ్డుకున్నారన్నారు. కాగా ఈ షాపింగ్ మాల్‌లో సుమారు 120 మంది పని చేస్తున్నారని, వారందరికీ ఇదే జీవనాధారమని, అందువల్ల తమకు కొంత సమయం ఇవ్వాల్సిందిగా షాపింగ్ మాల్ ప్రతినిధి రాజబాబు తెలిపారు.



బ్యాంకు అధికారులు, తదితరులను లోపలకు రాకుండా అడ్డుకున్న షాపింగ్ మాల్ సిబ్బంది



ముస్లిం యువకునికి ఆహారం తినిపిస్తున్న గణబాబు

ముస్లింలకు ఎమ్మెల్యే గణబాబు ఇఫ్తార్ విందు

గోపాలపట్నం, మార్చి 15: ఇస్లాం శాంతి ధర్మమని, ముహమ్మద్ ప్రవక్త బోధనల అనుసరణీయమైనవని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గోపాలపట్నంలోని తమ నివాసంలో గురువారం నియోజకవర్గంలోని ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి గణబాబు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లింల అభ్యున్నతికి అన్ని విధాల కృషి చేశానని, భవిష్యత్తులోనూ ముస్లింలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పలు మసీదుల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ముఖ్య అనుచరులతో మాజీ మంత్రి గంటా భేటి

నిర్ణయం అధిష్టానానికి చెబుతానని వెల్లడి

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన ముఖ్య అనుచరులతో గురువారం రుషికొండలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీపై వారితో చర్చించారు. గంటా గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. ఆయనకు ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేసే అలవాటు లేదు. అయితే ఈసారి తాను గతంలో పోటీ చేసి గెలిచిన భీమిలి నుంచే పోటీ చేయాలనుకుంటున్నానని కొద్దికాలం క్రితం ప్రకటించారు. ఇదే విషయాన్ని అధిష్టానానికి కూడా తెలియజేశారు. అయితే విజయనగరం జిల్లా చీపురుపల్లిలో విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. తాజాగా రెండు రోజుల క్రితం కూడా గంటా శ్రీనివాసరావు, తన వియ్యంకుడు నారాయణతో కలిసి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును కలిశారు. అప్పుడు కూడా చీపురుపల్లి నుంచే పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని చంద్రబాబు నాయుడు చెప్పారు. అయితే గంటా తాను అంత దూరం వెళ్లలేనని, భీమిలి నుంచే పోటీ చేయాలనుకుంటున్నానని మరోసారి చెప్పారు. తాజాగా గురువారం ఉదయం తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను విడుదల చేసింది. అందులో భీమిలి, చీపురుపల్లి నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలోనే గంటా తన ముఖ్య అనుచరులతో సమావేశమై చర్చించారు. దీనిపై ఆయనే ఒక ప్రకటన విడుదల చేశారు. మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశమై ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చించానని, వారి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు అధిష్టానానికి తెలియజేస్తానని అందులో పేర్కొన్నారు.

136 మద్యం బాటిళ్లు స్వాధీనం: వ్యక్తి అరెస్టు

గాజువాక, మార్చి 14: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని గాజువాక ఎస్ఈబీ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఈబీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి టోల్ గేటు సమీపంలోని రాజీవ్‌నగర్ మార్గంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడాన్ని గుర్తించిన ఎస్ఈబీ పోలీసులు పట్టుకోవడంతో ఆయన వద్ద కర్ణాటకకు చెందిన 136 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈ మేరకు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో హౌస్ ఆఫీసర్ వై.లక్ష్మునాయుడు, ఎస్ఐ ఎన్.రమ్య, తదితరులు పాల్గొన్నారు.



మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సిబ్బంది

ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 14: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16న జరగనున్న స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ ప్లాంట్ బీసీ గేటు వద్ద ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా రేవంత్ రెడ్డి రావడం అభినందనీయమన్నారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, ఉక్కు పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరాం, డీవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత చెక్కులు పంపిణీ

పెందుర్తి, మార్చి 14: మహిళల ఆర్థిక సాధికారతకు వైసీపీ చేయూతనిస్తోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెలమ సంక్షేమ భవన్‌లో గురువారం మండలానికి చెందిన నాలుగో విడత చేయూత చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ 2,419 మంది లబ్ధిదార మహిళలకు రూ.4.53 కోట్ల చెక్కును అందజేశారు. డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఎంపీపీ నాగమణి, వైసీపీ నాయకులు గొరపల్లి శ్రీను, బొడ్డు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **SHAIK MADEENA SHAHEB** (Old Name), S/o. Shaik Narayana, resident of 27-4-20/1, Old Kamavaripalem, Old Gajuwaka, Visakhapatnam. Change my name from **SHAIK MADEENA SHAHEB** (Old Name) to **SHAIK MADEENA** (New Name) hence forth I am being called as **SHAIK MADEENA** (New Name), S/o. Shaik Narayana, for all purposes.
AJV_ 182780

CHANGE OF NAME

★ I, **SHAMEEM** (Old Name), W/o. Abdul Raheem, resident of Flat No.501, Sampath Sai Enclave, APHB Colony, PM Palem, GVMC, Visakhapatnam-41. Change my name from **SHAMEEM** (Old Name) to **SYED SHAMEEM** (New Name) hence forth I am being called as **SYED SHAMEEM** (New Name), W/o. Abdul Raheem, for all purposes.
AJV_182781

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

అక్కయ్యపాలెం: గ్రేటర్ 44వ వార్డు లబ్ధిదారులకు గురువారం కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను కేకే రాజు పంపిణీ చేశారు. శ్రీనివాసనగర్ సచివాలయంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు.











రహదారులపైనే వాహనాల పార్కింగ్

- రాకపోకలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

మురళీనగర్, మార్చి 14: భారీ వాహనాలపై రహదారులపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే నగరంలో ఎటు చూసినా వాహనాలు భారీగా పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాలపై రోడ్లపైనే నిలిపివేస్తుండడంతో మరిన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, స్కూల్స్, భారీ షాపింగ్ మాల్స్, మార్కెట్ ప్రాంతాలతో రద్దీగా ఉండే ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. మెయిన్ రోడ్ల నుంచి వీధి రోడ్ల వరకు మాధవధార, ఎన్‌జీజీవోఎస్ కాలనీ, మురళీనగర్ ప్రాంతాల్లో వ్యాపారుల గోదాములు ఉన్నాయి. వాటికి సరకులు చేరవేసేందుకు వచ్చే భారీ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తుండడంతో ప్రయాణ మార్గాలు కుచించుకుపోతున్నాయి. ఆయా వాహనాలను రోజంతా నిలిపి ఉంచుతుండడంతో ఉదయం సాయంత్రం వేళ్లలో ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ ఈ సమస్య జఠిలమవుతోంది. వాహనాలు సమీపించేవరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటీఎం నగదు రవాణా సాగించే వాహనాలతో మాధవధార ఉడాకాలనీ చివరి బస్టాపు నుంచి ఎగువ కొండ దగ్గరి నివాసిత ప్రాంతాల వరకు చిక్కులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా ఆర్అండ్‌బీ జంక్షన్, ఆర్టీఏ కార్యాలయం వద్ద హైవే సర్వీసు రోడ్లలో భారీ వాహనాల నిలిపివేతతో ఉదయం స్కూలు బస్సుల నుంచి, రోజంతా ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలకు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై మాధవధారలోనే ఉన్న కంచరపాలెం ట్రాఫిక్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఉడా కాలనీలో రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు


ఆర్అండ్‌బీ కూడలిలో భారీ వాహనాలు ఇలా...

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 14: రానున్న ఎన్నికల్లో వైసీపీ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసే బాధ్యత టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులపై ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు పిలుపు నిచ్చారు. నక్కవానిపాలెం అరవై అడుగుల రోడ్డులో బీజేపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత విష్ణుకుమార్‌రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలో వచ్చిన జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అరాచకాలు సృష్టించే వ్యక్తిని ఓడించి ప్రజలు ఉత్తమ తీర్పు ఇవ్వాలని కోరారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు మంచి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ నాయకుడు బర్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నక్కవానిపాలెంలో శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

44వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం

అక్కయ్యపాలెం: గ్రేటర్ 44వ వార్డు రామచంద్రానగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ నేతలు మళ్ల లక్ష్మి, రఘునాథ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంత పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవి తొలగాలంటే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్, నాగడమూడి నానాజీ, కేవీ కుమార్, గురుగోవింద్‌సింగ్, శ్యామల దీపిక, సురేష్, చిన్నలక్ష్మి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గురువారం మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ప్రచారం చేశారు. 49వవార్డు చాకలి గెడ్డ, 50వవార్డు సత్యసాయినగర్ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యకర్తలు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

కిడ్నీల సంరక్షణపై బీచ్ రోడ్డులో వాక్ థాన్

సీతంపేట, మార్చి 14: కిడ్నీ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లతో జీవన విధానాన్ని కొనసాగించాలని అప్పుడే కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రవీంద్రవర్మ తెలిపారు.ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించామన్నారు. ఏఐఎన్‌యూ ఈడీ డాక్టర్ అమిత్ సాప్లే, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ ఉదయ్ గజారే, డాక్టర్ శ్యాం పేరి పాల్గొన్నారు.


వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పరీక్షల్లో 'పది' విద్యార్థులు ప్రతిభ చూపాలి

సీతమ్మధార, మార్చి 14: పదో తరగతి విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సూచించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలలో గురువారం సమితి సభ్యులు విద్యార్థులకు పెన్నులు, ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది 9వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున అందచేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు కె.హరి, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్ఎల్ఎం శర్మ, ప్రశాంతి, రాంప్రసాద్, ధనలక్ష్మి, జనార్దనరావు, పార్వతి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రతినిధులు

శంకువానిపాలెంలో పార్కు ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 14: గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలో రూ.16.3 లక్షల వ్యయంతో నిర్మించిన జీవీఎంసీ పార్కును కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీలా వెంకటలక్ష్మి, ముక్కా కిశోర్ కుమార్, బొడ్డేటి కిరణ్, రేవతిరావు, రవిబాబు పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్

అక్కయ్యపాలెం, మార్చి 14: వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా అక్కయ్యపాలేనికి చెందిన ఎం.సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకం ఉంచి, పదవి అప్పగించిన నాయకులకు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 14: విద్యుత్ హెచ్చు తగ్గులు తగ్గించే నిమిత్తం నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్, స్టడీ సెంటర్, శారదస్కూల్, శివాలయం స్ట్రీట్, వివేకానంద కళ్యాణ మండపం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

హాకీ టోర్నీకి విశాఖ క్రీడాకారిణులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 14: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ టోర్నీకి విశాఖకు చెందిన దివ్య, మాధురి, కళ్యాణి ఎంపికయ్యారు. పుణేలో జరగనున్న టోర్నీలో రాష్ట్ర జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో జరిగిన టోర్నీలో దివ్య, మాధురి, కళ్యాణి ప్రతిభ చూపి జాతీయ టోర్నీకి ఎంపికయ్యారు. వీరిని జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కేఈ అప్పారావు, కేవీ ఆంజనేయరావు, కోశాధికారి సత్యామృతం (అంబు), రాంజీ కోచ్‌లు అభినందించారు.

గీతం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మార్చి 14: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో ఎనభై అడుగుల రోడ్డులోని రాయల్ అపార్ట్‌మెంట్‌లో బసవతారకం కేన్సర్ హాస్పిటల్, గీతం సహకారంతో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బీపీ, షుగర్, ఎముకలు, కంటి పరీక్షలు, గైనిక్ సమస్యల నిర్ధారణ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గీతం సంస్థల అధినేత శ్రీభరత్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు శ్యామలా దీపిక, బొడ్డేటి శ్రీదేవి, కొయిలాడ వెంకటేష్, యాగాటి ఆదిలక్ష్మి, అమ్మాజి, పొలమరశెట్టి శ్రీనివాస్, రాజగిరి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేయించుకుంటున్న విష్ణుకుమార్ రాజు, శ్రీభరత్

విద్యుత్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అక్కయ్యపాలెం, మార్చి 14: విద్యుత్ సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలంతా సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ కోరారు. గ్రేటర్ 45వ వార్డు ఏఎస్ఆర్‌నగర్‌లోని టిడ్కో ఇళ్లలో నివశిస్తున్న వారికి గురువారం విద్యుత్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల విద్యుత్‌ను సబ్సిడీ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుల జెరాక్సులను అక్కయ్యపాలెంలోని విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వీఏ విద్యాసాగర్, ఏఈ జి.హరగోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

వంశీకృష్ణకు శెట్టిబలిజ, యాత సంక్షేమ సంఘం మద్దతు

మహారాణిపేట, మార్చి 14: దక్షిణ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ విజయానికి కృషి చేస్తామని విశాఖ యాత, శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్‌యాత అన్నారు. మహారాణిపేట గ్రీన్‌పార్క్‌లోని సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి వంశీకృష్ణకు సంఘీబావం ప్రకటించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి, శెట్టిబలిజ యాత సమాజిక వర్గం ఉన్నతి వంశీకృష్ణతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్తిమద్దతు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. సుమారు 50 వేల మెజారిటీతో వంశీకృష్ణ విజయానికి కృషి చేస్తామన్నారు.


జనసేన ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులు

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

జగదాంబ కూడలి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జగదాంబ జంక్షన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆ పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్ ఎగురవేశారు. పొత్తుల్లో భాగంగా దక్షిణ నియోజకవర్గ టికెట్ జనసేనకు కేటాయించడంతో పార్టీ శ్రేణులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. పార్టీ సమన్వయకర్త ప్రసాద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా కోడిగుడ్ల ట్రేలను పంపిణీ చేశారు. పాతనగరంలోని పలు వార్డుల్లో ఉచితంగా నిత్యావసర సరకులు అందజేశారు. జగదాంబ జంక్షన్ ఏర్పాటు చేసిన శిబిరంలో పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి

మురళీనగర్: ఉత్తర నియోజకవర్గంలో జనసేన పార్టీ నిర్దిష్టమైన ఓటు బ్యాంకుతో బలంగా పనిచేస్తోందని ఆ పార్టీ నాయకులు సంకు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు జనసైనికులంతా రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి విజయానికి పనిచేస్తామన్నారు. 50వవార్డులో గురువారం నిర్వహించిన జనసేన ఆవిర్భావ వేడుకల్లో శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. వైసీపీ పాలనా వైఫల్యంపై విసిగెత్తి ఉన్న జనం మార్పు కోరుతున్నారన్నారు. పార్టీ 50 వార్డు అధ్యక్షుడు మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తర ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, బి.రఘు జెండా ఎగుర వేశారు. నాయకులు, వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.


సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

గాజువాకపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తండ్రికి రాజకీయాల్లో శ్రీనివాసరావు చేదోడువాదోడుగా ఉండేవారు. 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజారాజ్యం పార్టీలో చేరి విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మూడు లక్షలకుపైగా ఓట్లు సాధించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యింది. రాష్ట్ర విభజన అనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరి గాజువాక నుంచి పోటీ చేసి 22 వేల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

2020లో జిల్లా అధ్యక్షునిగా....

2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని పటిష్ఠ పరిచారు. 2020లో జిల్లా పార్టీ అధ్యక్షుని పగ్గాలు చేపట్టారు.

అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తా: పల్లా

అధికారం ఉన్నా లేకపోయినా పార్టీకి విధేయుడిగా, ప్రజలకు అండగా ఉన్న తనకు వరుసగా మూడోసారి గాజువాక టికెట్ కేటాయించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. టికెట్ కేటాయించినందుకు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. గాజువాకలో అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తాను.

భీమిలి పెండింగ్

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు (ఆరు పూర్తిగా, మరొకటి పాక్షికంగా) ఉండగా...తెలుగుదేశం పార్టీ నాలుగు (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక), జనసేన రెండు (విశాఖపట్నం సౌత్, పెందుర్తి), బీజేపీ ఒక (విశాఖపట్నం నార్త్) చోట పోటీ చేయనున్నాయి. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి జాబితాలో విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుల పేర్లు ప్రకటించారు. గురువారం గాజువాకకు పల్లా శ్రీనివాసరావును ఖరారు చేశారు. ఇంకా భీమిలికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. అలాగే లోక్‌సభ స్థానం నుంచి 'గీతం' విద్యా సంస్థల అధ్యక్షులు ఎం.శ్రీభరత్ పోటీ చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అధికారికంగా ప్రకటించలేదు. ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పోటీ చేసే అవకాశం ఉంది.

కూటమి దూకుడు

... 5వ పేజీ తరువాయి

చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, జనసేన పార్టీకి కేటాయించిన అనకాపల్లి సెగ్మెంట్ నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లను గత నెల 24వ తేదీన ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గురువారం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి కేటాయించిన చోడవరం నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు పోటీ చేస్తారని పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. ఇక జనసేన పార్టీకి కేటాయించిన పెందుర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పేర్లను అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. అయ్యన్న, అనిత, కొణతాల ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, తాజాగా టికెట్లు ఖరారైన అభ్యర్థులు మంచి ముహూర్తం చేసుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇక అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది.

టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

స్పష్టంచేశారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించామన్నారు. పరీక్షల సిబ్బందికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. చివరకు కేంద్రాలు తనిఖీ చేసే సమయంలో విద్యాశాఖ అధికారులు కూడా సెల్‌ఫోన్లు పరీక్షా కేంద్రాల బయట ఉంచాలన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. పేపరు లీక్ చేసేందుకు యత్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, పరీక్షల సహాయ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

... 5వ పేజీ తరువాయి

శ్రీకాకుళానికి బదిలీ చేయించుకున్నారు. కొన్నాళ్ల కిందట టెక్కలిలో పనిచేస్తుండగా వైసీపీ నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా వేదికపైకి ఎక్కి మహిళలతో కలిసి డ్యాన్స్ చేసినట్టు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు వీఆర్‌కు సరండర్ చేశారు. అయితే తన రాజకీయ పలుకుబడితో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు నేపథ్యంలో కొద్దిరోజుల కిందట నగరానికి బదిలీపై వచ్చిన హరికృష్ణ లంచం కోసం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

తీసుకుంది. డిమాండ్లను ఏమీ పరిష్కరించబోమని, ముందు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టంచేసింది. కార్మికులు ప్లాంటుకు వచ్చి యథాప్రకారం డాక్ షీట్లలో (డార్స్) సంతకాలు చేస్తామంటే కుదరదని, బార్స్‌లో వేలిముద్రలు వేశాకే, డార్స్‌లో సంతకాలకు అనుమతిస్తామని సీఎండీ పేరుతో ప్లాంటు మానవ వనరుల విభాగం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇప్పటి వరకు బయోమెట్రిక్‌కు వివరాలు (డేటా) ఇవ్వని వారు ఎవరైనా ఉంటే సమీపంలో కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని, 15వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని స్పష్టంచేసింది. ఇక్కడ యాజమాన్యం మాత్రం బయోమెట్రిక్ అంతా వేస్తున్నా కార్మిక వర్గాలు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయని, విధులను తప్పించుకోవడానికి ఈ ఎత్తుగడ అన్నట్టు ప్రచారం చేస్తోంది. కానీ వారికి న్యాయంగా సమకూర్చాల్సిన మౌలిక వసతులు గురించి మాట్లాడడం లేదు. ఇదంతా ప్లాంటును ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాము బయోమెట్రిక్‌కు వ్యతిరేకం కాదని, కానీ ముందు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నాయి. కాగా బయోమెట్రిక్‌పై యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనకు కార్మికులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం ఉదయం పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తామని ప్రకటించారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా జీతాలు బంద్

- జనరల్ ఆస్పత్రి సిబ్బందికీ నిల్

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. పేరుకు వారు కాంట్రాక్టు వర్కర్లే అయినా ఆయా యాజమాన్యాలకు స్టీల్‌ప్లాంటే జీతాలు చెల్లిస్తుంది. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.15 వేలు నుంచి రూ.18 వేలు ఇస్తారు. ఇలా సుమారు 12,500 మంది పనిచేస్తున్నారు. స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఒకటో తేదీ రాగానే మొదట కార్మికులకే జీతాలు చెల్లిస్తోంది. ఆ తరువాత నిధుల సర్దుబాటును బట్టి అధికారులకు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి నెల జీతాలు 13వ తేదీన ఇచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా ఇవ్వలేదు. అలాగే స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో 86 మంది పనిచేస్తున్నారు. వారికి కూడా నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నెలవారీ జీతాలపై ఆధార పడి బతికే తమకు ఏ నెలకు ఆ నెల ఇవ్వకపోతే అప్పులు చేసుకోవాలని, ఇన్నేసి నెలలు అప్పు పుట్టడం లేదని, తక్షణమే యాజమాన్యం జీతాలు చెల్లించాలని వారంతా కోరుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పెద్దలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

'జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి'

డాబాగార్డెన్స్, మార్చి 14: జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో నివారణకు కమిటీలు వేయాలన్నారు. జర్నలిస్టులకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొవిడ్‌తో మరణించిన జర్నలిస్టులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కార్యక్రమానికి ఎల్ఎన్‌పీఏ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, జాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎస్.నాగేశ్వరరావు, ఆర్కేఎస్వీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, మార్చి 14 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ టీఐసీ పాయింట్ ఫీడర్, బాలాజీనగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరిలోవ టీఐసీ పాయింట్, శ్రీకాంత్ నగర్ లేఅవుట్, సుందరయ్య నగర్, అంబేడ్కర్ కాలనీ, క్రాంతినగర్, పెప్సీ గొడౌన్, ముస్తాఫా కాలనీ, పార్వతీనగర్, అన్నానగర్, బీటీఆర్ నగర్, బాలాజీ నగర్, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో...

విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ దృష్ట్యా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. తోటగరువు, బీఎన్ఆర్ నగర్, హనుమంతవాక కొండవాలు ప్రాంతం, విజయదుర్గా కాలనీ, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



పసిడి కుసుమాల మధ్య స్వామివారు

సింహాచలం, మార్చి 14 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్పృశింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ నామానికొక పసుడి పుష్పంతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.అనంతరం అదే వేదికపై నిత్యకల్యాణం నిర్వహించారు.

మేధో హక్కులపై గీతంలో వర్క్‌షాప్

సాగర్‌నగర్, మార్చి 14 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) ఆధ్వర్యంలో నగరంలోని వివిధ కళాశాలల బోధనా సిబ్బందికి, పరిశోధకులకు మేధో హక్కులపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్సార్ విశ్వవిద్యాలయం ఐపీఆర్ నిపుణుడు కె. రవీంద్రనాథ్, ఉమాపరమేశ్వరన్ ముఖ్య అతిథులుగా హాజరై పరిశోధనా ఫలితాలను పేటెంట్ చేసే విధానం, మేధోహక్కులను పొందడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జి-టెక్ డిప్యూటీ డైరెక్టర్ సోంబట్ శాస్త్రి, మెకానికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సమస్యాత్మక గ్రామాలపై సమావేశం

భీమునిపట్నం, మార్చి 14 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు, శాంతి భద్రతల పరిరక్షణపై శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి పోలీసు అధికారులంతా హాజరుకావాలని కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం

తగరపువలస, మార్చి 14 : జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటలో వైసీపీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. ఆదినారాయణ, గణేష్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారేట్ 25, దొండకాయలు 22, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 130, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 80, కీరదోస 26, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 92
ఫారం ధర	-- 112
విత్ స్కిన్	-- 196
స్కిన్‌లెస్	-- 206

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



12వ వార్డులో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న వెలగపూడి, శ్రీభరత్



18 వార్డులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ

సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- 12వ వార్డులో విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్‌తో కలిసి ప్రచారం

ఆరిలోవ, మార్చి 14 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేదలకు ఒక వరమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం ఆయన 12వ వార్డు తోటగరువులోని ఆరిలోవ ఆఖరి బస్టాపు, ఆపరేషన్ కాలనీ, నెహ్రూనగర్, ముస్తాఫాకాలనీ, తోటగరువు, గాంధీనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్‌తో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి, బీసీ డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, ప్రధాన కార్యదర్శి పోతన భరత్, జిల్లా కార్యదర్శి ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు,11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షుడు ముగడ రాజారావు, మూది అప్పారావు, 13వ వార్డు అధ్యక్షుడు పాత్రకండ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి యల్లమల్లి సురేష్, తురకపూడిబాలస్వామి, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో...

మద్దిలపాలెం : సూపర్ సిక్స్ పథకాలపై తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి గురువారం 23వ వార్డు చైతన్యనగర్‌లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గొలగాని పురుషోత్తం, నాయకులు బోస రాంబాబు, బూస పోతన్నరెడ్డి, గుడ్ల గోవిందరెడ్డి, కాకి వేణుబాయ్, చల్ల నూకరాజు, తెంటు స్వామి, నాయుడు, నిద్రబంగి కుమార్, పూతి వరప్రసాద్, కనకరాజు, నాగమణి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు'తో ఉన్నత చదువులు

భీమునిపట్నం : పట్టణంలోని బోయవీధి, నూకాలమ్మ గుడివీధి, కొత్తపేట ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలో రూపొందించిన కలలకు రెక్కలు పథకం గురించి ప్రజలకు వివరించారు.

ఎంవీపీ కాలనీలో ...

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని 7, 10, 11 సెక్టర్లలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఇంటింటికి వెళ్లి తూర్పు ఎమ్మెల్యేగా రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, రాజు, కళావతి, నరేంద్ర, వాసు, రాజు,దేముడుబాబు, ఈశ్రరావు, కనక, బంగార్రాజు పాల్గొన్నారు. అలాగే 18 వార్డులో టీడీపీ నాయకులు జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మానవ వనరుల అభివృద్ధితోనే ప్రగతి : మంత్రి బొత్స

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మానవ వనరుల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఏయూకి నాలుగు నెలల కిందట నాక్ డబుల్ ప్లస్ లభించిన సందర్భంగా గురువారం కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నాక్ సర్టిఫికెట్ ప్రతులను ప్రిన్సిపాల్స్‌కు అందించారు. సమావేశంలో మంత్రి విజన్ విశాఖకు సంబంధించి ప్రసంగించారు. కాగా నాక్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం అని పిలిచి, విజన్ విశాఖపై ప్రసంగించడంతో హాజరైన వారంతా కంగుతున్నారు.

మద్దిలపేటలో రక్తదాన శిబిరం

భీమునిపట్నం (రూరల్), మార్చి 14 : మండలంలోని మద్దిలపేటలో కనకల వెంకటేష్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సిబ్బంది యువత నుంచి 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు జి. వెంకటప్పడు, సర్పంచ్ నారాయణ, తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు

ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతుగా రాస్తారోకో

తగరపువలస, మార్చి 14 : ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా తగరపువలసలో స్థానిక రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ భీమిలి జోన్ నాయకుడు ఆర్. నరసింగరావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను మోదీ ప్రభుత్వం చేపడుతుందన్నారు. సెంట్రల్ వేర్ హౌస్‌లన్నీ అంబానీ, అదానీలకు అప్పగించడంతో భవిష్యత్తులో ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడనుందన్నారు. కేంద్రం తక్షణమే సోమనాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేత్ర సమస్యల పట్ల అప్రమత్తం

ఆరిలోవ, మార్చి 1 : నేత్ర సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు డాక్టర్ దివ్య దంగేటి సూచించారు. గ్లకోమా కంటికి ఒత్తిడి కలిగించే దృష్టి లోపం గల వ్యాధి అని చెప్పారు. గురువారం ఆమె హనుమంతువాక జంక్షన్ సమీపంలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాలలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా రోగులకు నేత్ర సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని సకాలంలో చికిత్స అందిస్తే దృష్టి కోల్పోవడం నివారించవచ్చునన్నారు.

ఏయూలో క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సులు

వెంకోజీపాలెం, మార్చి 14 : ఏయూ లైఫ్ ఫెర్టిలిటీ సంస్థతో సంయుక్తంగా రెండేళ్ల కాల వ్యవధితో మాస్టర్ ప్రోగ్రాం ఇన్ క్లీనికల్ ఎంబ్రియాలజీ, ఏడాది కాల వ్యవధితో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సులు నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో నూతన కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఇటువంటి కోర్సులను అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందన్నారు. అనంతరం కోర్సు వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో లైఫ్ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు డాక్టర్ కె. మురళీకృష్ణ, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు డాక్టరేట్



విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ్ షిప్పింగ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సాంబశివరావుకు ఏయూ పీహెచ్‌డీ లభించింది. విశాఖపట్నం పోర్టు సరుకు రవాణాలో కంటెయినరైజేషన్ పాత్ర' అన్న అంశంపై ఆయన అధ్యయనం చేశారు. దీనికి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ మోహన్ వెంకటరామ్ రీసెర్చి డైరెక్టర్‌గా వ్యవహరించగా వీసీ ప్రసాద్‌రెడ్డి ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

రెడ్డిపల్లిలో జూనియర్ కళాశాల ప్రారంభం

పద్మనాభం, మార్చి 14 : రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల ఆవరణలో నూతనంగా అప్‌గ్రేడ్ అయిన జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి గురువారం ప్రారంభించారు. రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు జీఓ నెంబరు 14 ద్వారా అప్‌గ్రేడ్ చేసిన కళాశాలల జాబితాలో రెడ్డిపల్లి పాఠశాలకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీఓ శైలజ పాల్గొన్నారు.

నారసింహ మహా యజ్ఞం ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, మార్చి 14 : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈనెల 26 నుంచి సింహగిరిపై జరిగే శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ ఈఓ శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, వైదిక,లౌకిక అధికారులతో యజ్ఞ నిర్వహణపై స్వామివారి కల్యాణ మండపంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం యాగ శాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ యజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సిబ్బంది,పాలక మండలి సభ్యులు, మీడియా సహకరించాలని కోరారు.యజ్ఞం రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి తీరంలో స్వచ్ఛభారత్

భీమునిపట్నం, మార్చి 14 : భీమిలి బీచ్‌లో చెరకుపల్లి అవంతి ఫార్మా కళాశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరంలో ఉన్న చెత్తను పూడ్చారు. అలాగే గాంధీజీ పార్క్‌లో లవ్ భీమిలి వద్ద ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సందర్శకులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మత్స్యకారులకు సముద్ర పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కలాశాల ప్రిన్సిపాల్ ఎంబీవీ రాజు తెలిపారు.

కొళాయిల్లో కలుషిత నీరు



ఆరిలోవ, మార్చి 14 : జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో కొళాయిల ద్వారా గురువారం కలుషిత నీరు సరఫరా అయ్యింది. నీరు పూర్తిగా రంగు మారి నాచు రంగులో ఉంది. దీంతో మహిళలు నీరు పట్టకుండా విడిచిపెట్టారు. సురక్షిత నీరు సరఫరా చేయలేని పాలకులు, అధికారుల తీరుపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

పద్మనాభం (రూరల్), మార్చి 14 : అనంతవరం, బాందేవుపురం గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు, అలాగే కొవ్వాడ, పొట్నూరు, తునివలస గ్రామాల్లో జలజీవన్ పథకం ద్వారా నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు, గంధవరంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ సుంకరి గిరిబాబు, భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోరడా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

పద్మనాభం (రూరల్), మార్చి 14 : మండలంలోని మద్ది, బాందేవుపురం, వీకేపాలెం, తిమ్మపురం గ్రామా ల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్. వెంకటరావు గురువారం పరిశీలించారు. కేంద్రాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వాటిని పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని సిబ్బందికి సూచించారు.

సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

సింహాచలం, మార్చి 14 : అడివివరంతో పాటు ఏడు గ్రామాల ఆరాధ్య దేవత, సింహాద్రి అప్పన్న సోదరి సత్తెమ్మతల్లి (మరిడిమాంబ)కి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి పుట్టినరోజు పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు తరువాత కుంకుమార్చనలు జరిపారు. రాత్రి వరకు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ సింగల శ్రీనివాసమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. .

వైభవంగా అప్పన్న తిరువీధి

సింహాచలం, మార్చి 14 : వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం గురువారం రాత్రి వైభవంగా సింహగిరి మాడవీధుల్లో ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే సంక్రమణాన్ని పురస్కరించుకుని తిరువీధి జరపడం ఆనవాయితీ. ఈమేరకు మీన సంక్రమణాన్ని పురస్కరించుకుని సాయంత్రం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక పల్లకిలో ఉంచారు. పండితుల వేద పఠనాలు, అధ్యాపకుల నాలాయిర దివ్యప్రబంధ పారాయణలు, ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు నడుమ మాడ వీధుల్లో తిరువీధి జరిపారు.

ప్రేమ సమాజం భూములకు రక్షణగా ప్రహరీ నిర్మాణం

సాగర్‌నగర్, మార్చి 14 : రుషికొండలోని ప్రేమ సమాజం భూములకు ప్రహరీ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రేమ సమాజం ఆశ్రమానికి రుషికొండలో 50 ఎకరాలు ఉంది. ఈ భూములన్నీ తీరానికి సమీపంలో ఉండడమే కాకుండా అత్యంత ఖరీదు కావడంతో ఆక్రమణకు గురవ్వకుండా చుట్టూ ప్రహరీ వేస్తున్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

ఎంవీపీ కాలనీ, మార్చి 14 : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని ఆచార్యులు పి. సోమరాజు, డి. దక్షిణామూర్తి అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యువత ఉజ్వల భవితకు విద్యతో పాటు నైతిక విలువలతో కూడిన నడవడిక కూడా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి, ఆచార్య ఎస్. రజని, ప్రిన్సిపాల్ కె. మురళీ సోమేశ్వరరావు, డాక్టర్ ఏ. సాయిరూప్, ఉపాధ్యక్షుడు డీవీఎస్ కామేశ్వరరావు, ఆచార్య ప్రగడ రాజగణపతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎండాడ, మార్చి 14 : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన 8వ వార్డు రుషికొండ తారకరామానగర్‌లో రూ.7 కోట్లతో చేపట్టనున్న థీమ్ పార్కుతో పాటు సాగర్‌నగర్‌లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ప్రణవ్‌కు పోలీసుల నోటీసు

ఎంవీపీ కాలనీ, మార్చి 14 : టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు కాపలా ఉండడంతో పాటు నోటీసు కూడా ఇచ్చారు. ఎలాంటి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకూడదని నోటీసులో పేర్కొన్నారు. ఎంవీపీ స్టేషన్ ఎస్ఐ పేరిట ఇచ్చిన ఈ నోటీసు జారీ చేశారు.

చీరలు పంపిణీ

మద్దిలపాలెం, మార్చి 14 : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం శివాజీపాలెంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మరికొద్ది రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి చేయగల టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తుందన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు : అదనపు కమిషనర్



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పూర్ణ

వెంకోజీపాలెం, మార్చి 14 : వేసవి దృష్ట్యా నగరంలో చలివేంద్రాలు, సేవ తీరేందుకు షెల్టర్లను ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, పలు స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రత గత ఏడాది కంటే అధికంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థమై, ఆరోగ్య సంరక్షణకు నగరంలో చలివేంద్రాలు, షెల్టర్లు ఏర్పాటు చేయాలని, నేషనల్ హైవేలో ప్రతి మూడు కిలోమీటర్లకు, ప్రధాన రహదారుల్లో ప్రతి కిలోమీటర్‌కు చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, బస్టాప్‌లు, సంతలు, బజార్లు, పార్కుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి చలివేంద్రం వద్ద పాదచారులు కూర్చొని సేద తీరేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు, నివాస సంక్షేమ సంఘాలను జడ్సీలు సమన్వయం చేసుకుని అవసరమైన సహకారం అం దించాలని సూచించారు. అలాగే పార్కుల్లో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.



అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

'రైతులకు అన్యాయం చేయొద్దు'

సింహాచలం, మార్చి 14 : జీవీఎంసీ 98వ వార్డు సింహాచలం ప్రధాన మార్గాన్ని కలుపుతూ ప్రత్యామ్నాయంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం పాత అడివివరం, లండగరువు, విజినిగిరిపాలెం, వరాహ పుష్కరిణి మీదుగా ఈఓ ఆఫీసు ముం దు నుంచి నిర్మిస్తున్న రోడ్డు పనులను విజినిగిరిపాలెం గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ గురువారం సర్వే పనులు చేపట్టారు. ఎటువంటి ముం దస్తు నోటీసులు, చర్చలు, సంప్రదింపులు లేకుండా తమకు చెందిన జిరాయితీ భూముల్లో నుంచి రోడ్డు వేసేందుకు సర్వే జరిపేందుకు యంత్రాలతో రావటాన్ని రైతులు వ్యతిరేకించారు. ఈమేరకు సర్వే నిమిత్తం జంగిల్ క్లియర్ చేయడానికి తీసుకువచ్చిన జేసీబీని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ సంఘటనా స్థలికి చేరుకుని అధికారులను నిలదీశారు. రైతులకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదని, దీని వెనుక అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ నేతలు ఉన్నారని ఆరోపించారు.

గీతంలో బయోమెడ్ భారత్-24 ప్రారంభం



మాట్లాడుతున్న ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈఓ డాక్టర్ జితేంద్రశర్మ

సాగర్‌నగర్, మార్చి 14 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్సర్) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయోమెడ్ భారత్-2024 కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్న యువతకు మెడ్‌టెక్ జోన్ ద్వారా మూడు నెలలు ఇంటర్న్‌షిప్‌తో పాటు స్వయంగా కంపెనీ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.గీతం వీసీ ఆచార్య దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ వైద్య రంగం అవసరాలను గుర్తించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జాతీయ స్థాయిలో ఈ బయోమెడ్ హ్యాక్‌థాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా కార్యక్రమంలో భాగంగా యువతకు శుక్రవారం బయోమెడ్ హ్యాక్‌థాన్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

520 మందికి వైద్య పరీక్షలు

పెదవాల్తేరు, మార్చి 14 : పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టడంలో గీతం యూనివర్సిటీ, ఎన్టీఆర్ సేవా సమితి ముందుంటాయని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం 20వ వార్డు పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద టీడీపీ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి శిబిరాన్ని ప్రారంభించగా వైద్యులు 520 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, నాయకులు ముప్పల పోలారావు, కాళ్ల శంకర్, కంబాపు శివరెడ్డి, నరేంద్ర, గోపి పాల్గొన్నారు.

ముఖ్య అనుచరులతో మాజీ మంత్రి గంటా భేటీ

- నిర్ణయం అధిష్ఠానానికి చెబుతానని వెల్లడి

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన ముఖ్య అనుచరులతో గురువారం రుషికొండలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీపై వారితో చర్చించారు. గంటా గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. ఆయనకు ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేసే అలవాటు లేదు. అయితే ఈసారి తాను గతంలో పోటీ చేసి గెలిచిన భీమిలి నుంచే పోటీ చేయాలనుకుంటున్నానని కొద్దికాలం క్రితం ప్రకటించారు. ఇదే విషయాన్ని అధిష్ఠానానికి కూడా తెలియజేశారు. అయితే విజయనగరం జిల్లా చీపురుపల్లిలో విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని అధినేత చంద్రబాబునాయుడు సూచించారు. తాజాగా రెండు రోజుల క్రితం కూడా గంటా శ్రీనివాసరావు, తన వియ్యంకుడు నారాయణతో కలిసి పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. అప్పుడు కూడా చీపురుపల్లి నుంచే పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని చంద్రబాబునాయుడు చెప్పారు. అయితే గంటా తాను అంత దూరం వెళ్లలేనని, భీమిలి నుంచే పోటీ చేయాలనుకుంటున్నానని మరోసారి చెప్పారు. తాజాగా గురువారం ఉదయం తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను విడుదల చేసింది. అందులో భీమిలి, చీపురుపల్లి నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలోనే గంటా తన ముఖ్య అనుచరులతో సమావేశమై చర్చించారు. దీనిపై ఆయనే ఒక ప్రకటన విడుదల చేశారు. మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశమై ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చించానని, వారి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు అధిష్ఠానానికి తెలియజేస్తానని అందులో పేర్కొన్నారు.

21న ఆశీలు వసూలుకు వేలం

భీమునిపట్నం, మార్చి 14 : పట్టణంలోని 3 వార్డులో భీమిలి రోడ్డు మార్టిన్, లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణ మార్కెట్‌లో రోజువారీ ఆశీలు వసూలుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ఏ ఒక్కరూ పాల్గొనకపోవడంతో ఈనెల 21వ తేదీకి వేలాన్ని వాయిదా వేసినట్టు జడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు ధరావత్తు సొమ్మును బ్యాంకులో డిడి కట్టి ఆ రోజు వేలం పాటలో పాల్గొనాలని ఆమె సూచించారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



వైజాగ్	-	రమాదేవి
వైజాగ్	-	వరుణ్ ఐనాక్స్
వైజాగ్	-	సిఎమ్ఆర్ ఐనాక్స్
వైజాగ్	-	చిత్రాలయ ఐనాక్స్
వైజాగ్	-	ముక్తా ఎ2 సినిమాస్
నర్సీపట్నం	-	పివిఆర్ ఐనాక్స్
అనకాపల్లి	-	షిరిడీ సాయి
మధురవాడ	-	శ్రీకన్య సినీపోలిస్
గాజువాక	-	వి. శేష
గాజువాక	-	సిఎమ్ఆర్ ఐనాక్స్
విజయనగరం	-	ఎన్‌సిఎస్ ఐనాక్స్
శ్రీకాకుళం	-	కీర్తిక

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SHAIK MADEENA SHAHEB (Old Name), S/o. Shaik Narayana, resident of 27-4-20/1, Old Kamavanipalem, Old Gajuwaka, Visakhapatnam. Change my name from SHAIK MADEENA SHAHEB (Old Name) to SHAIK MADEENA (New Name) hence forth I am being called as SHAIK MADEENA (New Name), S/o. Shaik Narayana, for all purposes.
AJV_ 182780

CHANGE OF NAME

★ I, SHAMEEM (Old Name), W/o. Abdul Raheem, resident of Flat No.501, Sampath Sai Enclave, APHB Colony, PM Palem, GVMC, Visakhapatnam-41. Change my name from SHAMEEM (Old Name) to SYED SHAMEEM (New Name) hence forth I am being called as SYED SHAMEEM (New Name), W/o. Abdul Raheem, for all purposes.
AJV_182781

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి